క్లుప్తంగా

23న గోదల్ వక్ఫ్ బోర్డు భూముల వేలం

బల్మూర్: మండలంలోని గోదల్ శివారులోని జామ మసీద్ వక్ఫ్ బోర్డు భూములను ఏడాది పాటు సేద్యం చేసుకునేందుకు ఈ నెల 23న(మంగళవారం) వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శైలేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. చీఫ్ ఎగ్జిక్యూటీవ్ అధికారి తెలంగాణ స్టేట్ వక్ఫ్ బోర్డు నాంపల్లి వారి ఆదేశాల మేరకు గోదల్ శివారులోని 120, 121/2లోని జామ మసీద్ భూమి 369-11 ఎకరాల భూమిని 2024-25 సంవత్సరానికి వార్షిక సేద్యం చేసుకునేందుకు 23న ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ వేలంలో పాల్గొనే వారు 18 సంవత్సరాలు నిండిన వారై ఉండాలన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.5 వేల డిపాజిట్ చెల్లించి పాట పాడిన వారు ఒక సంవత్సరం కాస్తు కోసం అదే రోజు పైకం చెల్లించాలని తెలియజేశారు. వేలం పూర్తయ్యే వరకు ఈ భూమిని ఎవరూ సేద్యం చేయరాదని, వేలం ఆపుటకు, మార్పు చేయుటకు వక్ఫ్ బోర్డు వారికి పూర్తి అధికారం ఉందని వివరించారు.

రైతు బీమాకు దరఖాస్తుల ఆహ్వానం

కొల్లాపూర్ రూరల్/ కోడేరు/ పెద్దకొత్తపల్లి: మండలంలోని రైతులు నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని కొల్లాపూర్ మండల వ్యవసాయ అధికారి రమేష్ నాయక్, కోడేరు మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ ఏఈఓ మధుసూదన్‌రెడ్డి, పెద్దకొత్తపల్లి ఏఈఓ ముజీబ్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గతంలో రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల పేర్లు ఏమైనా తప్పులు ఉన్నా.. సరి చేసుకోవచ్చని రెన్యూవల్ చేసుకునేందుకు ఈ నెల 30 వరకు చివరి తేదీ ఉందన్నారు. అదేవిధంగా కొత్త పాసుబుక్‌లు వచ్చిన రైతులు పాసుబుక్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు, దరఖాస్తు ఫాం తీసుకురావాలన్నారు. చివరి తేదీ ఆగస్టు 5వ తేదీ వరకు ఉంటుందని తెలియజేశారు.

సైబర్ మోసగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ఉప్పునుంతల: రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో పడుతున్నందున సైబర్ మోసగాళ్లు రైతుల బ్యాంక్ ఖాతాలను హ్యాక్ చేసే ప్రమాదముందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ లెనిన్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సెల్‌ఫోన్ ద్వారా ఎవరైనా బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన సమాచారం అడిగినా, వాట్సాప్ ద్వారా వచ్చే గుర్తు, ఏపీకే ఫైల్స్, లింక్‌లను ఓపెన్ చేయకూడదన్నారు. ఫోన్‌కు ఓటీపీలు వచ్చినా గుర్తు తెలియని వ్యక్తులకు వాటిని చెప్పకూడదన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

తహసీల్దార్‌కు వినతి

పెద్దకొత్తపల్లి: మత్స్యకారులు, ముదిరాజుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు శనివారం డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌నాయక్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు సైదులు, వెంకటస్వామి మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, మత్స్యకారులు, ముదిరాజుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అభయహస్తం మత్స్యకారులకు నూటికి నూరు శాతం ఉచితంగా చేపపిల్లలు అందజేయాలని, ముదిరాజుల అభివృద్ధికి కోఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేసి రూ.వెయ్యికోట్ల నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాములు, ముదిరాజు మత్స్యకార్మికులు, వెంకటస్వామి, రామస్వామి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ ర్యాంకర్లకు ఆర్థికసాయం

కల్వకుర్తి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన విద్యార్థులు ఐదుగురు స్టేట్ ర్యాంకులు సాధించారు. శనివారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థినుల విషయాన్ని తెలుసుకొని ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ కేవీ కళాశాలకు చేరుకుని వారిని అభినందించారు. పేదరికం వారి చదువుకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో వారికి ఆర్థిక సాయం అందించానని తెలియజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆదిలక్ష్మి, భవిజ్ఞ, ఆరాధ్య, నాజ్మీర్, షరీఫ్, దీప్తిలకు కలిపి ఒక్కొక్కరికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, కళాశాల లెక్చలర్లు పాల్గొన్నారు.

రెయిన్‌కోట్స్ అందజేత

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ సత్యం శనివారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో రెయిన్‌కోట్స్ అందజేశారు. వానాకాలంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా విధి నిర్వహణలో ఉండే వారు జాగ్రత్తలు తీసుకోవాలని, పనులతో పాటుగా ఆరోగ్యాన్ని సైతం కాపాడుకోవాలన్నారు. సేఫ్టీలో భాగంగా రెయిన్‌కోట్లు, షూస్, హ్యాంగ్ గ్లౌజ్‌లు, రేడియం జాకెట్లు, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు పరికరాలు వారికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, కమిషనర్ ఆశ్రిత్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

వీడని ముసురు

- ఎడతెరిపి లేని వర్షాలతో మెట్ట పంటలకు నష్టం
- అపరిశుభ్రంగా మారిన వీధులు



మంతటి శివారులో ముసురు వర్షం కారణంగా పత్తి చేలలో నిలిచిన వర్షపు నీరు

నాగర్‌కర్నూల్ రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఎడతెర్పు లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలతో పంట చేలలో నీరు నిలిచి పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే పొలాల్లో నీరు నిలిచి పత్తి, కంది తదితర పంటలు ఎర్రబారుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ముసురు వర్షాలతో వీధులు చిత్తడిచిత్తడిగా మారి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అక్కడక్కడ వీధుల్లో వర్షపు నీరు నిలిచి దోమల ఉధృతి పెరిగి ప్రజలు అంటురోగాల బారిన పడే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. మూడు రోజులుగా భారీ వర్షాలు కుర్వకుండా ముసురు వర్షాలే కురుస్తుండటంతో వీధుల్లో కాలు తీసి కాలు పెట్టలేని పరిస్థితుల్లో తయారయ్యాయి. ఈ వర్షం ఇలాగే మరో రెండు రోజులు కురిస్తే, ప్రజలు విష జ్వరాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. ప్రధానంగా అక్కడక్కడ మోస్తారుగా కురిసిన వర్షాలతో చెరువుల్లోకి, కుంటల్లోకి కొద్దిపాటిగా వర్షపునీరు వచ్చి చేరుతుంది. భారీగా వర్షం పడితే చెరువులు, కుంటలు నిండే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈ ముసురు వర్షాలతో మెట్ట పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా పశువులు, గొర్రెలు ఈ ముసురు వర్షానికి మేతకు వదలకపోవడంతో అర్ధాకలితో అలమటిస్తున్నాయని కాపరులు వాపోతున్నారు. అంతే కాకుండా వర్షం పడి గడ్డిపై వర్షపు నీరు నిలిచి ఉండడంతో మూగజీవాలకు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని వాపోతున్నారు. ఈ వర్షం ఇలాగే కురిస్తే.. తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు.



రాయిపాకులు ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

కొల్లాపూర్‌లో ముసురు వర్షం

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో శనివారం రోజంతా ముసురు వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రోజువారీగా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలోని చెరువులన్నీ నిండాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో రహదారులు బురదమయంగా మారాయి.

సురక్షిత నివాసాలకు వెళ్లాలి



చారకొండలో ముసురు వర్షాలకు కూలిన పైకప్పును పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రమీల

చారకొండ: రెండు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షానికి మండలంలోని ప్రజలు శిథిలావస్థలోని నివాసాల నుంచి సురక్షిత నివాసాలకు తరలివెళ్లాలని తహసీల్దార్ ప్రమీల సూచించారు. రెండు రోజులుగా కురుస్తున్న ముసురుతో మండల కేంద్రానికి చెందిన మారుపాకుల సుగుణమ్మ, చింతపల్లి లక్ష్మమ్మ, మోగిల్ల సరోజిని ఇళ్లు ముసురుకు దెబ్బతినడంతో పైకప్పు కూలిపోయింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ ప్రమీల ధ్వంసమైన నివాసాలను పరిశీలించారు. నష్టపోయిన వారి వివరాలను ఉన్నత అధికారులకు నివేదిస్తామన్నారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పాత ఇళ్లలో నివసించే వారు ప్రత్యామ్నాయంగా, ప్రభుత్వ భవనాలు, ఇతరుల ఇళ్లలో నిసించాలని తెలియజేశారు. వారి వెంట ఆర్‌ఐ రామకృష్ణ, నాయకులు బాల్‌రాం గౌడ్ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ వైర్లను తాకడం ప్రమాదం

ఉప్పునుంతల: ముసురు వర్షాలు కురుస్తున్నందున తడి ప్రదేశాల్లో ఉన్న కరెంట్ వైర్లను తాకడం ప్రమాదకరమని ట్రాన్స్‌కో ఏఈ అమర్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇళ్ల వద్ద కరెంట్ రావడంలేదని, రైతుల వ్యవసాయ పొలాల్లో బోర్లు, స్టార్టర్ల వద్ద తెగిపడిన విద్యుత్ వైర్లను సరిచేయడం గానీ, కరెంట్ స్తంభాలను ఎక్కడం గానీ ప్రమాదకరమని పేర్కొన్నారు. ఏదైనా కరెంట్ సమస్య ఉన్నప్పుడు నా దృష్టికి తీసుకరావడం లేదా స్థానికంగా ఉన్న విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చి బాగు చేయించుకోవాలని ఏఈ సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోడేరు: మండలంలోని ప్రజలు వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. మట్టి మిద్దెలో ఉండరాదని, దగ్గరలోని ప్రభుత్వ భవనాల్లో ఉండాలని, ఇనుప విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు.

లింగాల: నిరంతరంగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ అప్పలనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని దళితులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు తెలంగాణ ప్రభుత్వం పట్టాలివ్వాలని దళిత దండు రాష్ట్ర అధ్యక్షుడు బచ్చలకూర బాల్‌రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకు ముందు రామాపురంలో దళితులు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులు సాగు చేసుకుంటున్న భూములకు గత ప్రభుత్వం పట్టాలివ్వలేదన్నారు. గిరిజనులకు మాత్రమే పట్టాలిచ్చి చేతులు దులుపుకొందన్నారు. దళితుల మీద జరుగుతున్న దాడులను కూడా ప్రభుత్వం అరికట్టాలన్నారు.

‘అండగా ఉంటాం’..

బల్మూర్: గుండెపోటుతో మృతిచెందిన మండలంలోని వెంకటగిరికి చెందిన వీఓఏ చింత సత్యనారాయణ కుటుంబానికి అండగా ఉండి ఆర్థికంగా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి అకాల మృతి చెందిన సత్యనారాయణ మృతదేహానికి శనివారం గ్రామంలో అత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో విండో డైరెక్టర్ లాల్‌రెడ్డి, నాయకులు సంపంగి రమేష్, శ్రీనివాసులు, ఇమ్మడి కొండల్, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



వినతి అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: కళాశాల విద్యార్థులకు పెండింగ్‌లోని స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బహుజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శనివారం నోడల్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యాసంవత్సరం పూర్తయినా.. నేటికి విద్యార్థులు ధ్రువపత్రాల కోసం కళాశాలలకు వెళ్తే.. ప్రైవేటు యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే పత్రాలు ఇస్తామని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆయన ఇచ్చిన వినతిలో పేర్కొన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లోని స్కాలర్‌షిప్‌లను, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. సాయిరాం, రవి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఇల్లును శుభ్రం చేయాలని ఇద్దరు మహిళా కూలీలను తీసుకెళ్లి ఇల్లు శుభ్రం చేసిన తర్వాత కూలీలను కారులో ఎక్కించుకొని ఆజీపూర్ వద్ద కూలీలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను శిక్షించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిర్భయ, అభయ అనేక మహిళ రక్షణ చట్టాలు వచ్చినప్పటికీ ఈ అఘాయిత్యాలను అరికట్టడంలో, మహిళలకు రక్షణ కల్పించడంలో పోలీసు యంత్రాంగం విఫలం అవుతుందని విచారం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నత యంత్రాంగం ఇలాంటి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, శిక్షించాలని డిమాండ్ చేశారు.

విగ్రహావిష్కరణ జయప్రదం చేయండి


తెలకపల్లి: విగ్రహ ఆవిష్కరణను జయప్రదం చేయాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు వేముల ఆంజనేయులు గౌడ్ కోరారు. శనివారం తెలకపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 22న జిల్లా కేంద్రంలో ఉదయం 11 గంటలకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. విగ్రహవిష్కరణకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రులు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు హాజరవుతారని తెలియజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు గౌడ్‌తో పాటు శ్రీనివాస్‌గౌడ్, బాలస్వామిగౌడ్, తిరుపతయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ



చారకొండ: మండల కేంద్రంలో శనివారం ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ తనిఖీ చేసి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, వంట నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వంట నిర్వహణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీలో పాల్గొని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గణేష్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం



అల్లాపూర్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాస్

లింగాల: విద్యార్థులు ఇంటి వద్ద ఉన్న సమయంలో తల్లిదండ్రులు, పాఠశాలకు హాజరైన సమయంలో ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలని జీహెచ్‌ఎం ఎండీ బషీర్ అహ్మద్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాభివృద్ధిపై తీసుకోవాల్సిన పలు అంశాలపై చర్చించారు. విద్యార్థులు పాఠశాలకు పంపడంలో తగు శ్రద్ధ తీసుకోవాలని, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చూడాలని హెచ్‌ఎం తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పోల మంగమ్మ, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని జీహెచ్‌ఎం సుగుణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వ్యక్తులే జీవితంలో ఉన్నత స్థానాల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను సకాలంలో పాఠశాలకు పంపించాలన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు అండగా ఉండి, నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొత్త భవనం నిర్మించాలని తీర్మానం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని నార్లాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థుల తలిదండ్రులు, ప్రధాన ఉపాధ్యాయులు మద్దిలేటి సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని తీర్మానించారు.

విద్యార్థులను విధిగా పాఠశాలకు పంపించాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను వారి తల్లిదండ్రులు విధిగా పాఠశాలకు పంపించాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్ రెడ్డి, రమేష్ కోరారు. శనివారం మండలంలోని ఆయా పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు.



వెల్దండలో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎం సుగుణ

కార్యవర్గాన్ని ఎన్నుకోవాలి

మన్ననూర్: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం కోసం ఎన్నికలు నిర్వహించాలని ఆ మహాసభ రాష్ట్ర కార్యవర్గం సభ్యులు సంబు వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదేళ్లుగా లక్ష్మినారాయణ ఒక్కడే అధ్యక్షుడిగా కొనసాగడం నిబంధనలకు విరుద్ధమన్నారు. నూతనంగా ఆర్యవైశ్య మహాసభను ఎన్నుకోవాలన్నారు. ఆర్యవైశ్యుల్లోని నిరుపేదల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రస్తుత సీఎం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని వీధులు చిత్తడిగా మారాయని, దోమల పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శన వాల్‌పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: ఫొటో, వీడియోగ్రఫీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు వస్తున్న మార్పులను అధిగమించేందుకు తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శన తిలకించాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి కోరారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేడు ఆధునిక సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఫొటో చిత్రీకరణలో అనేక మార్పులు వస్తున్నాయని, వాటిని అధ్యయనం చేసేందుకు ఈ ప్రదర్శన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫొటో ఫొటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నేతాజీ గౌడ్, పట్టణ అధ్యక్షుడు రాఘవులు, బెల్లం నరసింహ, ఎత్తపు శివ, వీరేందర్ గౌడ్, శీను, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతులందరికీ పంట రుణాలు అందిస్తాం..



వెల్దండలో విలేకరులతో మాట్లాడుతున్న కల్వకుర్తి డీసీసీ బ్యాంక్ మేనేజర్ రఘు

వెల్దండ: ప్రభుత్వం రైతులకు పంట రుణాలు మాఫీ చేసిందని, రుణాలు మాఫీ అయిన రైతులందరికీ తిరిగి రుణాలు అందిస్తామని కల్వకుర్తి డీసీసీబీ మేనేజర్ రఘు పేర్కొన్నారు. వెల్దండలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు పంట రుణాలను మాఫీ చేసిందన్నారు. రూ.లక్ష రుణాల వరకు మాఫీ అయినట్లు వివరించారు. కల్వకుర్తి డీసీసీబీ పరిధిలోని మిడ్జిల్, వెల్దండ, చారకొండ, రంగాపూర్, కల్వకుర్తి బ్రాంచ్‌ల్లో మొత్తం 4,810 ఖాతాలకు రూ.34 కోట్లు అవసరం ఉందని ఉన్నత అధికారులకు నివేదికలు అందించామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆయా బ్యాంకుల పరిధిలోని 726 మంది ఖాతాలకు కేవలం రూ.3.42 కోట్లు విడుదల అయినట్లు వివరించారు. ప్రభుత్వం రెండో, మూడో విడతల్లో రుణాలు మాఫీ అవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 2018 నుంచి 9వ తేదీ డిసెంబర్ 2023 వరకు పంట రుణాలు మాఫీ చేస్తుందన్నారు. 2023 సంవత్సరం డిసెంబర్ 9 వరకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందన్నారు. డిసెంబర్ తరువాత ఉన్న పంట రుణాలకు, రుణమాఫీకి సంబంధం లేకుండా ఏడు నెలల పాటు వడ్డీ రైతులే చెల్లించుకోవాలని తెలియజేశారు. రుణమాఫీ పొందిన రైతులు మీసేవా కేంద్రాల్లో ఆర్‌ఓఆర్ పత్రాలను బ్యాంక్‌లో అందించాలన్నారు. రైతులకు పంట రుణాలు కాని వారు మండల వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారిణి మంజుల, బ్యాంక్ సిబ్బంది శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లిలో 3,987 మందికి రుణమాఫీ

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్ష వరకు రుణమాఫీ చేసిన పథకంలో 3,987 మంది రైతులకు రుణమాఫీ లభించింది. మిగితా రైతులకు రూ.1.50లక్షల వారికి త్వరలో రుణమాఫీ ఉంటుందని వ్యవసాయ అధికారి శిరీష తెలియజేశారు. ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేపడుతుందని వివరించారు.

సందేహాలకు ఏఈఓలను సంప్రదించాలి

చారకొండ: ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీపై ఆయా గ్రామాల్లో రైతులు సందేహాలను సంబంధిత ఏఈఓలను సంప్రదించి, తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఏఓ చిన్న హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో రైతు రుణమాఫీ నిధుల విడుదల సందర్భంగా రైతులకు వివరాలు తెలియజేశారు. మండల వ్యాప్తంగా 1,464 మంది రైతుల ఖాతాల్లో రూ.లక్ష లోపు ఉన్న రుణాలకు రైతుల ఖాతాలో నదగు బదిలీ అయినట్లు పేర్కొన్నారు.

ప్రతి రైతుకు రుణమాఫీ

కోడేరు: మండంలోని రైతులకు తప్పనిసరిగా రుణమాఫీ వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. మొదటి విడతగా మండలంలో 2,736 మంది రైతులకు రుణమాఫీ వచ్చినట్లు తెలియజేశారు. మిగితా వారికి కూడా త్వరలోనే రుణమాఫీ వర్తిస్తుందన్నారు. రైతులు ఎవ్వరూ ఆందోళనకు గురికావొద్దని సూచించారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తాం..



రైతులతో మాట్లాడుతున్న సీజీఎం బిక్షపతి

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని గొరిట సబ్‌స్టేషన్‌కు మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని, 15 రోజుల్లో విద్యుత్తు అంతరాయం లేకుండా సమస్యలు పరిష్కరిస్తామని సీజీఎం బిక్షపతి రైతులకు హామీ ఇచ్చారు. చేగుంటలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని శుక్రవారం ఆ గ్రామ రైతులు గొరిట సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులు డీఈ శ్రీధర్‌శెట్టి, ఏఈ సాయన్నగౌడ్ సీజీఎం బిక్షపతితో కలిసి వచ్చారు. విద్యుత్తు అంతరాయంపై చేగుంట గ్రామ రైతుల అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. విద్యుత్తు గతంలో కన్న ఇప్పుడు నాణ్యత, అధిక సమయం విడుదల అవుతుందని, కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక సమస్యల కారణంగా విద్యుత్తు అంతరాయం కలుగుతుందన్నారు. గొరిట సబ్‌స్టేషన్‌లో మరో ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, దానిని 15 రోజుల్లో ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు.

కంటి వైద్యశిబిరం పరిశీలన



వెల్దండలో కంటి వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి

వెల్దండ: పేద ప్రజలకు అండగా ఉండి, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఏవీఆర్ గార్డెన్‌లో ఐక్యత ఫౌండేషన్, శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. పేద ప్రజలకు అండగా ఉంటున్న సంస్థలను అభినందించాలన్నారు. గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా కంటిఅద్దాలు, ఆపరేషన్లు చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 27వ తేదీ వరకు కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కురుమూర్తి, ఐక్యత ఫౌండేషన్ సిబ్బంది నరేందర్‌గౌడ్, మల్లయ్య, రమేష్‌నాయక్, కొండల్, యూసుఫ్ తదితరులు ఉన్నారు.

జప్తీ సదగోడులో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

ఉప్పునుంతల: మండలంలోని జప్తీ సదగోడులో శనివారం అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే పౌష్టికాహారం, విద్యపై అవగాహన కల్పించారు. రెండున్నర ఏళ్ల వయస్సు నిండిన పిల్లలను అంగన్‌వాడీలో చేర్చుకున్నారు. బాల బాలికలతో అక్షరాభ్యాసం చేయించారు. ఐదుగురు విద్యార్థులను స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీపాషా, అంగన్‌వాడీ టీచర్ సావిత్రి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

బీసీ బడ్జెట్ ఏర్పాటుకు కృషి చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోతున్న అసెంబ్లీ సమావేశాల్లో జనాభా దామాషా ప్రకారం బీసీ బడ్జెట్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.